ఆధ్యాత్మిక వనం

ఒకప్పుడు విశాఖ క్రైస్తవులకు అలంబనగా నిలిచిన పునీత ఆంథోనీ దేవాలయం ఇప్పుడు కుల, మతాలకు అతీతంగా అందరి హృదయాల్లోనూ సుస్థిర స్థానం సంపాదించుకుంది. 1917లో రూపుదిద్దుకున్న ఈ చర్చి శతాబ్ది ఉత్సవాలను ఆరేళ్ల కిందటే పూర్తి చేసుకుంది. జగదాంబ జంక్షన్‌కు కూతవేటు దూరంలో గల పునీత ఆంథోనీ దేవాలయాన్ని 1917లో కేవలం రూ.9 వేల ఖర్చుతో నిర్మించారు. ఈ చర్చి నేడు ఎంతో మందికి ఆపన్నహస్తం అందిస్తోంది. మరెంతో మంది విద్యార్థులకు చదువుతో పాటు క్రమశిక్షణ, ఆధ్యాత్మికత నేర్పుతోంది.

- నేడు పునీత ఆంథోనీ చర్చిలో ప్రత్యేక పూజలు
- సాయంత్రం 5 గంటల నుంచి పెద్ద ఎత్తున పుర ప్రదక్షిణ
- 6 గంటల నుంచి సాంస్కృతిక కార్యక్రమాలు



పునీత ఆంథోనీ చర్చి

డాబాగార్డెన్స్: జగదాంబ జంక్షన్‌లో గల పునీత ఆంథోనీ చర్చి రూపకల్పనలో ఎన్నో ఘట్టాలున్నాయి. క్రీ.శ.1852లో రెవ.టిస్సోర్ ప్రకాశరావుపేటలో ఒక చిన్న గృహాన్ని అద్దెకు తీసుకుని దైవ కార్యక్రమాలు ప్రారంభించారు. తర్వాత ఆన్‌స్లెమ్‌రేయ్ చాపెల్‌లో ప్రార్థనలు నిర్వహించారు. ఆయన తర్వాత జేబీ గాంటియర్ గుడి బాధ్యతలు తీసుకున్నారు. అప్పటికే భక్తుల సంఖ్య అధికమవ్వడంతో జగదాంబ జంక్షన్‌లో నూతన దేవాలయ నిర్మాణానికి పూనుకుని, 1917లో పూర్తి చేశారు. అప్పటి బిషప్ రెవ. జీన్ మెరిక్లైయర్ ఆ నిర్మాణానికి పునీత ఆంథోనీ దేవాలయంగా నామకరణం చేశారు. క్రీస్తును ప్రేమతో పెంచిన ఇటలీకి


బాల ఏసుని లాలిస్తున్న పునీత ఆంథోనీ

చెందిన స్త్రీమూర్తే ఆమె.

1923 నుంచి విద్యాసేవ..

ఈ చర్చి దినదినాభివృద్ధి చెందుతూ వచ్చింది. దేవాలయ సేవలు మరింత విస్తృతం చేస్తూ 1923వ సంవత్సరంలో చర్చి ఆవరణలోనే పాఠశాలను నెలకొల్పారు. తర్వాత 10 ఎకరాల విస్తీర్ణంలోని ప్రాంగణంలో ఒకవైపు దేవాలయం, మరో వైపు విద్యాలయం ప్రారంభించారు. అప్పటి మిలిటరీ నాలుగో బెటాలియన్‌కు చెందిన గుర్రాలను అధిక సంఖ్యలో వరుసగా దేవాలయం ముందు ఉంచడంతో ఇది 'లైన్‌గుడి'గా కూడా ప్రసిద్ధి చెందింది.

మంగళవారం ప్రత్యేకం..

పునీత ఆంథోనీ తన విశిష్టమైన సేవలందించి సెయింట్‌గా గుర్తింపు సాధించారు. కొన్ని దశాబ్దాల కిందట ఆమె జూన్ 13వ తేదీ, మంగళవారం దేహం చాలించారు. ఈ నేపథ్యంలో ప్రతి మంగళవారం నిర్వహించే ప్రత్యేక ఆధ్యాత్మిక కార్యక్రమాలకు దాదాపు 2 వేల మంది భక్తులు ఈ చర్చికి నేటికీ వస్తుంటారు. దీంతో పాటు ఏటా జూన్ 13వ తేదీన కూడా ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహిస్తూ పునీత ఆంథోనీ సేవల్ని స్మరించుకుంటారు.

భక్తుల సహకారం మరువలేనిది..

చర్చి అభివృద్ధిలో భక్తులు అందిస్తున్న సహకారం మరువలేనిది. ఈ దేవాలయం ఇలాంటి ఎన్నో వసంతాలు పూర్తి చేసుకోవాలి. దాని కోసం అహర్నిశలు శ్రమిస్తాను. చర్చి ఫాదర్‌గా సేవలందించడం చాలా సంతోషంగా ఉంది. ప్రతి ఒక్కరూ శాంతిని చాటాలి.

– బాలశౌరి, విచారణ గురువు, సెయింట్ ఆంథోనీ చర్చి

నేటి కార్యక్రమాలిలా..

పునీత ఆంథోనీ (గుడి పండగ) సేవల్ని స్మరించుకుంటూ గురువారం ఉదయం 7 గంటలకు తెలుగులోనూ, 9 గంటలకు ఇంగ్లీషులోను పూజ నిర్వహిస్తారు. సాయంత్రం 5 గంటలకు సెయింట్ ఆంథోనీ చర్చి నుంచి ప్రారంభమై ఉన్నత పాఠశాల, ఆంథోనీనగర్, రామజోగిపేట, భుజంగరావుపేట, దండు బజార్, దిబ్బలపాలెం, జగదాంబ జంక్షన్, వాల్తేర్ అప్‌రోడ్డు మీదుగా తిరిగి చర్చి వరకు ప్రదర్శన సాగనుంది. సాయంత్రం 6 గంటలకు విశాఖ అగ్రపీఠాధిపతి జయరావ్‌చే మహోత్సవ కృతజ్ఞతా బలిపూజ నిర్వహించనున్నారు. అనంతరం పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించనున్నారు.

క్లుప్తంగా

ఎరుకుమాంబకు జలాభిషేకం


ఎరుకుమాంబకు జలాభిషేకం చేస్తున్న భక్తులు

సీతమ్మధార: దొండపర్తిలో వెలసిన ఎరుకుమాంబ అమ్మవారికి బుధవారం భక్తులు స్వయంగా జలాభిషేకం నిర్వహించారు. ఆలయ అర్చకుడు శ్రీనివాస్ భక్తుల గోత్ర నామాలతో పూజలు చేశారు. సాయంత్రం కూడా భక్తులు అమ్మవారికి జలాభిషేకం చేయగా.. అమ్మవారిని పసుపు కుంకుమలు, పూలతో అలంకరించారు. అనంతరం భక్తులకు దర్శనం కల్పించారు. ఈ కార్యక్రమంలో దేవస్థానం సిబ్బంది, అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

ఆట విడుపు


మిరపకాయల వీధిలో క్రికెట్ ఆడుతున్న చిన్నారులు

అల్లిపురం: సెలవులు ముగుస్తున్నాయి.. ఒరేయ్ అన్నయ్య క్రికెట్ ఆడుకుందాం.. పదండ్రా బాల్, బ్యాట్ తెండ్రా.. పెట్టండ్రా ఇటుక.. అటు వెళ్తే 4, గోడ దాటితే 6, పైకి కొడితే అవుట్ మొదలెట్టండ్రా క్రికెట్.. ఒరేయ్ బాల్ వెయ్యరా..అంటూ బుధవారం మిరపకాయల వీధిలో చిన్నారులు గల్లీ క్రికెట్‌తో సందడి చేస్తూ 'సాక్షి' కెమెరాకు చిక్కారు.

పేద విద్యార్థిని చదువుకు చేయూత


విద్యార్థినికి పుస్తకాలు అందిస్తున్న రామ అప్పారావు

అగనంపూడి: జీవీఎంసీ 85వ వార్డు పెదమడక నిర్వాసిత కాలనీకి చెందిన నిరుపేద విద్యార్థిని జి.రాణికి సమాచార హక్కు చట్టం కార్యకర్త పట్టా రామ అప్పారావు రూ.5 వేల విలువైన అచ్చు పుస్తకాలు, నోట్ పుస్తకాలు అందించారు. విశాఖ విమల విద్యాలయంలో చదువుతున్న రాణి తల్లి కష్టపడితే తప్ప ఇల్లు గడవడం కష్టంగా ఉండడంతో రామ అప్పారావు సాయం చేశారు. ఈ సందర్భంగా సర్వహిత చారిటబుల్ ట్రస్ట్ వ్యవస్థాపకులు గుదే గజేంద్రరావు మాట్లాడుతూ పేదల కష్టాలపై చలించే రామ అప్పారావు సేవలు మరువలేనివన్నారు. కార్యక్రమంలో ట్రస్ట్ చైర్మన్ ఎం.మస్తాన్‌రెడ్డి, చిత్రా నాగమణి పాల్గొన్నారు.

శరవేగంగా ఆయుష్మాన్ ఆస్పత్రి పనులు


విమ్స్ ఆవరణలో చేపడుతున్న ఆయుష్మాన్ ఆస్పత్రి నిర్మాణం

ఆరిలోవ: విశాఖ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ (విమ్స్) ఆవరణలో చేపట్టిన ఆయుష్మాన్ ఆస్పత్రి నిర్మాణ పనులు శరవేగంగా సాగుతున్నాయి. కేంద్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో నిర్మిస్తున్న ఈ ఆస్పత్రి కోసం విమ్స్ ఆవరణలో ఒకటిన్నర ఎకరాల స్థలాన్ని కేటాయించారు. ఇక్కడ 50 పడకలతో ఈ ఆస్పత్రి నిర్మాణం చేపడుతున్నారు. ఈ ఏడాది జనవరి మొదటి వారంలో పనులు ప్రారంభించారు. ప్రశాంతమైన వాతావరణంలో నిర్మిస్తున్న ఈ ఆస్పత్రి అందుబాటులోకి వస్తే అన్ని వర్గాల ప్రజలకు అతి తక్కువ ఖర్చుతో మెరుగైన వైద్య సేవలు అందనున్నాయి. ఆయుష్మాన్ ఆస్పత్రి కూడా అందుబాటులోకి వస్తే మరింత ఎక్కువ మందికి వైద్య సేవలు అందుబాటులోకి రానున్నాయని నగర వాసులు ఆశిస్తున్నారు.

వైభవంగా ఆలయ ద్వితీయ వార్షికోత్సవం


అనఘా లక్ష్మీ వారాహీ సహిత రాజశ్యామల అమ్మవారు


లక్ష పుష్పార్చనకు సిద్ధం చేస్తున్న పువ్వులు

డాబాగార్డెన్స్: అస్సాం గార్డెన్స్‌లో వెలసిన అనఘా లక్ష్మీ, వారాహి సహిత రాజశ్యామల అమ్మవార్ల ఆలయ ద్వితీయ వార్షికోత్సవం బుధవారం అత్యంత వైభవంగా నిర్వహించారు. లోక కల్యాణార్థం విశ్వశాంతిని కాంక్షిస్తూ సాయిదర్బార్ ప్రాంగణంలో గల అమ్మవార్ల సన్నిధిలో ఆలయ అర్చకులు శైవాగమ రీతిలో గణపతి పూజ, పుణ్యాహవాచనం, లక్ష పుష్పార్చన, కుంకుమార్చన, ప్రత్యేక పూజలు, మహాలక్ష్మి హోమం జరిపారు. మహిళలు, భక్తులు సామూహిక శ్రీలలితా సహస్రనామ పారాయణ చేశారు. అర్చకుల వేద పఠనంతో ఆలయ ప్రాంగణం మార్మోగింది. వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని పెద్ద ఎత్తున అన్నప్రసాద వితరణ చేపట్టారు. పెద్ద ఎత్తున స్థానికులు అమ్మవార్లను దర్శించుకున్నారు. కార్యక్రమంలో శ్రీసాయి మేరు ట్రస్ట్ చైర్మన్ పీఎస్‌వీజీ ప్రసన్న, కార్యదర్శి పి. శ్రీనివాస శాస్త్రి, జి. రమ, ప్రముఖ ఆధ్యాత్మికవేత్త ఎంవీ రాజశేఖర్, పి. సతీష్, ఎ. రామ్‌రాజ్, డాక్టర్ కె. వీరభద్రం తదితరులు పాల్గొన్నారు.

పేరుకుపోయిన వ్యర్థాలతో ఇక్కట్లు

అల్లిపురం: జీవీఎంసీ 33వ వార్డు వెంకటేశ్వరమెట్టకు వెళ్లే దారిపై నల్లటి జిగురు తెట్టులా పేరుకుపోవడంతో జారుతున్నట్లు స్థానికులు, వాహన చోదకులు, పాదచారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వేంకటేశ్వరస్వామి దేవస్థానం ద్వారం వద్ద జీవీఎంసీ పారిశుధ్య సిబ్బంది ఏర్పాటు చేసిన డంపర్ బిన్‌ల వద్ద నుంచి ద్వారం వరకు జిగురులాంటి పదార్థం రోడ్డుపై ఆవరించింది. డంపర్ బిన్లలో స్థానిక హోటళ్ల వారు వేస్తున్న వ్యర్థాలు, నూనెతో కూడిన పదార్థాల వల్ల రోడ్డుపై నల్లగా ఒక రకమైన జారుడు పదార్థం ఏర్పడింది. దానిపై నుంచి వాహనాలు ప్రయాణించే సమయంలో స్కిడ్ అవుతున్నాయని, చాలా మంది పడిపోయారని స్థానికులు తెలిపారు. పాదచారులు కూడా ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వెంకటేశ్వరమెట్ట, సాయిబాబావీధి, నారాయణ


వెంకటేశ్వరమెట్ట ద్వారం వద్ద రోడ్డుపై పేరుకుపోయిన జిగురు వంటి పదార్థం

వీధి, మిరపకాయలవీధికి వెళ్లే ప్రజలతో పాటు బల్లిగిరి వేంకటేశ్వరస్వామి దేవస్థానానికి వెళ్లే భక్తులు కూడా ఇబ్బంది పడుతున్నారని స్థానికులు తెలిపారు. జీవీఎంసీ సిబ్బంది పరిస్థితిని చక్కదిద్దాలని, జిగురు వంటి పదార్థాన్ని తొలగించాలని స్థానికులు, వాహన చోదకులు, పాదచారులు కోరుతున్నారు.

వైభవంగా అప్పన్న నిత్య కల్యాణం

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి బుధవారం నిత్యకల్యాణం విశేషంగా జరిగింది. ఆలయ కల్యాణ మండపంలోని వేదికపై స్వామివారి ఉత్సవ మూర్తులు గోవిందరాజస్వామి,శ్రీదేవి, భూదేవిలను అధిష్టంపజేశారు. విష్వక్సేనపూజ, పుణ్యాహవచనం, సంకల్పం, కంకణధారణ, యజ్ఞోపవీతం,జీలకర్రబెల్లం, మాంగల్యధారణ, తలంబ్రాలు తదితర ఘట్టాలతో కల్యాణం వైభవంగా నిర్వహించారు. ఉభయ


యజ్ఞోపవీతధారణ ఘట్టం నిర్వహిస్తున్న అర్చకుడు

దాతలకు స్వామివారి అక్షింతలు, ప్రసాదాన్ని అధికారులు అందజేశారు.

తస్మాత్ జాగ్రత్త..

అల్లిపురం: పిట్ట కొంచెం.. కూత ఘనం అన్నట్లు ఉంది టాటా ఏస్ వాహనం పరిస్థితి. 75 ఫీట్ రోడ్డులో పరిమితికి మించి లోడ్ వేయటంతో దూసుకుపోతున్న ఈ వాహనం పక్క నుంచి వెళ్లేందుకు కూడా ఎవరూ సాహసించరు. ప్లాస్టిక్ నీటి తొట్టెలను ఇష్టానుసారం వాహనం అంతా నింపేశారు. పొరపాటున కట్టిన కట్లు ఊడితే జరిగే ప్రమాద తీవ్రత చెప్పనలవి కాదు. ప్రమాదాలను కొని తెచ్చుకోకుండా ఇలాంటి వాహనాలకు కనీసం 50 అడుగుల ఎడంగా ప్రయాణిస్తే మంచిది. ప్రమాదాలు చెప్పిరావు కనుక ఎవరి జాగ్రత్తల్లో వారుండాలి.



75 ఫీట్ రోడ్డులో ప్రమాదకరంగా పరిమితికి మించిన లోడుతో వెళ్తున్న వాహనం

ఘన వ్యర్థాల నిర్వహణలో నిబంధనలు తప్పనిసరి

మహారాణిపేట: ప్రభుత్వ, ప్రైవేటు సంస్థలు ఘన వ్యర్థాల నిర్వహణ నియమాలు కచ్చితంగా పాటించాలని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి ఎంవీ శేషమ్మ అన్నారు. బుధవారం జిల్లా న్యాయ సేవాధికార సంస్థ, ఏపీ కాలుష్య నియంత్రణ మండలి సంయుక్త ఆధ్వర్యంలో ఘన వ్యర్థాల నిర్వహణ నియమాలు–2016పై మాధవధారలో గల కాలుష్య నియంత్రణ మండలి కార్యాలయంలో జరిగిన సదస్సులో ఆమె ప్రసంగించారు. నిబంధనలు పాటించకపోతే భారీ జరిమానా కట్టవలసి ఉంటుందన్నారు. తడి–చెత్త పొడి, ప్రమాదకర వ్యర్థాలను వేర్వేరుగా సేకరించాలన్నారు. ఈ కార్యక్రమంలో కృష్ణా విశ్వవిద్యాలయం పూర్వ ఉపకులపతి ఆచార్య ఎస్‌ఆర్‌కే రావు, ఏపీ కాలుష్య నియంత్రణ మండలి అదనపు ఎగ్జికూటివ్ ఇంజినీర్ ఎ.శ్రీరామ చంద్రమూర్తి, పోర్టు శానిటరీ ఇన్‌స్పెక్టర్ వీవీఎస్‌టీ


మాట్లాడుతున్న జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి ఎంవీ శేషమ్మ

మూర్తి, జీవీఎంసీ అసిస్టెంట్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ ఎ.సునీల్‌కుమార్, జిందాల్ కంపెనీ అసిస్టెంట్ జనరల్ మేనేజర్ వి.సతీష్, అదనపు ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ శ్రీలక్ష్మి, వీధి వ్యాపారులు తదితరులు పాల్గొన్నారు.

బడి..ఆనందాల ఒడి

- చిన్నారులను ఆకర్షించేలా తీర్చిదిద్దిన అచ్చియ్యమ్మపేట ప్రాథమిక పాఠశాల
- ఆటపాటల నడుమ బోధన
- నేటి నుంచి తెరుచుకోనున్న పాఠశాలలు

అల్లిపురం: చిన్నారుల బడులు సరికొత్త రూపు సంతరించుకున్నాయి. వేసవి సెలవులు పూర్తి కావటంతో గురువారం నుంచి పాఠశాలలను పునః ప్రారంభించేందుకు విద్యాశాఖ అన్ని ఏర్పాట్లు పూర్తి చేసింది. విద్యార్థులు కూడా పాఠశాలలకు వెళ్లేందుకు సన్నద్ధమవుతున్నారు. దక్షిణ నియోజకవర్గంలో ప్రభుత్వ పాఠశాలలు సరికొత్తగా వెలుగొందుతున్నాయి.

ఆహ్లాదమే చిరునామా..

బడికి వెళ్లేందుకు పిల్లలు మారాం చేస్తుంటారు. కానీ జీవీఎంసీ 34వ వార్డు పరిధి అచ్చియ్యమ్మపేట


గణిత శాస్త్రం గుర్తులతో తీర్చిదిద్దిన పాఠశాల ఆవరణ

ప్రాథమిక పాఠశాలను చూస్తే పిల్లలు ఆ మాట అనరు. చదువు ఒక్కటే కాదు ఆరోగ్యం కూడా ప్రధానమని భావించిన ప్రభుత్వం అందుకు తగిన ఏర్పాట్లు చేసింది. ఆవరణలో అడుగు పెట్టగానే గణిత శాస్త్రంలో కొలమానాలు ఆహ్వానం పలుకుతాయి. చిన్నారుల మెదళ్లకు పదును పెట్టే వైకుంఠపాళీ లాంటి చిత్తరువు రారమ్మంటూ పిలుస్తుంటుంది. శరీర దారుఢ్యానికి అవసరమైన ఆట వస్తువులు, వారి తెలివికి పదును పెట్టే పజిల్స్, తూగుటుయ్యాలలు.. ఇలా బాలల భవిష్యత్తుకు బాటలు వేస్తున్నట్లు చిన్నారులను చదువులమ్మ తన ఒడిలోకి ఆహ్వానిస్తున్నట్లు అనిపిస్తుంది. బడంటే చదువొక్కటే కాదు.. ఆటలు, పాటలు, ఆరోగ్యం, ఆహారం, ఆహ్లాదం, ఆనందాల ఒడి అంటూ పిల్లలు చెంగు చెంగున వచ్చేలా ఈ పాఠశాలను తీర్చిదిద్దటం విశేషం.


చిన్నారులను ఆకర్షించే ఆట వస్తువులు


వైకుంఠపాళి వద్ద ఆడుకుంటున్న చిన్నారులు


ఆకట్టుకుంటున్న అచ్చియ్యమ్మపేట ప్రాథమిక పాఠశాల

ఉక్కు కార్మికుల జీతాలు చెల్లించాలి

అగనంపూడి: స్టీల్‌ప్లాంట్ కార్మికుల జీతాలు ఈ నెలలో అయినా సకాలంలో చెల్లించేలా యాజమాన్యం చర్యలు తీసుకోవాలని విశాఖ ఉక్కు పోరాట కమిటీ నాయకులు ఎస్.రామారావు కోరారు. విశాఖ ఉక్కు పరిరక్షణ, పోరాట కమిటీల నేతృత్వంలో కూర్మన్నపాలెం కూడలి వద్ద దీక్షా శిబిరంలో బుధవారం ఆయన మాట్లాడారు. జీతాల చెల్లింపునకు యాజమాన్యం ఇచ్చిన మాటను ఈ సారైనా నిలబెట్టుకోవాలన్నారు. నాలుగు దశాబ్దాలుగా ఉక్కు రంగంలో మకుటం లేని మహారాజుగా వెలుగొందిన విశాఖ స్టీల్‌ప్లాంట్‌ను కేంద్ర ప్రభుత్వం కుట్రలు పన్ని హీనస్థితికి తీసుకెళ్లిందని ఆరోపించారు. ఈ దుస్థితికి కారణమైన ప్రభుత్వాలు ఇప్పటికైనా కళ్లు తెరవాలని, ఆంధ్ర రాష్ట్రానికి అతిపెద్ద దిక్కుగా ఉన్న ఉక్కు కర్మాగారానికి


దీక్షా శిబిరంలో నాయకులు, కార్మికులు

ఊపిరి పోసేందుకు సంకీర్ణ ప్రభుత్వ పెద్దలు కృషి చేయాలని కోరారు. దీక్షా శిబిరంలో ఎస్ఎంఎస్ – 2 విభాగ కార్మికులు, నాయకులు డి.ఆదినారాయణ, రమణమూర్తి, నరేంద్ర, భాస్కరమూర్తి, మాణిక్యాలరావు, మరిడయ్య, వెంకటమ్మ పాల్గొన్నారు.

విలక్షణ విమర్శకుడు శ్రీశ్రీ

సీతంపేట : సహృదయ సాహితీ ఆధ్వర్యంలో స్థానిక ప్రిజమ్ కళాశాలలో శ్రీశ్రీ వర్ధంతి సందర్భంగా 'విలక్షణ విమర్శకుడు శ్రీశ్రీ' అనే అంశంపై సాహిత్య సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథి ఆచార్య వెలమల సిమ్మన్న మాట్లాడుతూ శ్రీశ్రీ అలుపు లేని అన్వేషి అని, వెనుదిరగని సాహసి అన్నారు. జనం జీవనాడి తెలుసుకున్న మహోన్నత వ్యక్తి అని కొనియాడారు. ప్రయోగశాలిగా, పదునైన విమర్శకుడిగా శ్రీశ్రీ వినుతికెక్కాడని అన్నారు. సహృదయ సాహితీ అధ్యక్షుడు శేఖరమంత్రి ప్రభాకర్ అధ్యక్షతన ముందుగా ఇటీవల దివంగతులైన సహృదయ సాహితీ సభ్యుడు టీపీఎస్ ఆచార్యులకు ఘన నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో సాహితీవేత్తలు కె.వి.ఎస్.మూర్తి, డి.వి.సూర్యారావు, ఎస్.విజయ్ కుమార్, సి. హెచ్.చినసూర్యనారాయణ, కొత్తూరు రమణ, కుప్పిలి భీమేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఆచార్య వెలమల సిమ్మన్న

అనాథ బాలలకు ఎంబీఏ విద్యార్థుల చేయూత


అనాథ బాలలకు సమకూర్చిన వస్తువులతో ఎంబీఏ విద్యార్థులు, తదితరులు

అగనంపూడి: దువ్వాడలోని విజ్ఞాన్ ఎంబీఏ కళాశాలకు చెందిన విద్యార్థులు సామాజిక సేవా స్ఫూర్తిని చాటుకున్నారు. విశాఖ పరిధిలోని 7 అనాథాశ్రమాలకు చెందిన 195 మంది బాలలను కళాశాలకు బుధవారం తీసుకొచ్చి వైద్య పరీక్షలు నిర్వహించారు. అవసరమైన వారికి మందులు ఉచితంగా అందించారు. ఈ సందర్భంగా కళాశాలలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో పారిశ్రామికవేత్త తరుణ్‌కుమార్ మాట్లాడుతూ అనాథాశ్రమాల్లోని ఇబ్బందులను గుర్తించి వారికి సహకారం అందించేందుకు ముందుకొచ్చిన విద్యార్థులను అభినందించారు. వైద్య సేవలు అందించిన వైద్యులు డాక్టర్ పవన్‌కుమార్, డాక్టర్ ప్రశాంతి మాట్లాడుతూ ఆశ్రమాల్లోని బాలలు ఆరోగ్యం, దంతాలను పరిరక్షించుకోవడానికి తీసుకోవాల్సిన జాగ్రత్తలు వివరించారు. తర్వాత బాలలకు వివిధ క్రీడా పోటీలు, సాంస్కృతిక పోటీలు నిర్వహించి బహుమతులు అందించారు. కళాశాల రెక్టార్ వి.మధుసూదనరావు మాట్లాడుతూ అనాథ బాలల కోసం 'కర్తవ్య' పేరుతో ఇటువంటి మంచి కార్యక్రమం చేపట్టడం సంతోషంగా ఉందన్నారు. ఆశ్రమాలకు కావల్సిన నిత్యావసర వస్తువులతోపాటు ఫ్యాన్లు, దుస్తులు, స్కూల్ బ్యాగ్‌లు, కిరాణా సామగ్రి, స్టేషనరీ అందించారు. కార్యక్రమంలో ఎంబీఏ విభాగాధిపతులు సన్యాసిరావు, బి.చంద్ర, విద్యార్థులు పాల్గొన్నారు.

పక్కాగా పాఠ్య పుస్తకాలు సరఫరా చేయాలి

ఆరిలోవ : చినగదిలి మండలంలో అన్ని ప్రభుత్వ పాఠశాలలకు పాఠ్య పుస్తకాలు, బ్యాగులు, బెల్టులు, నోట్ పుస్తకాలు ఉన్న కిట్లు సక్రమంగా పంపిణీ చేయాలని ఆర్జేడీ బి.విజయభాస్కర్ ఎంఈవోలను ఆదేశించారు. తోటగరువు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పాఠ్య పుస్తకాల కేంద్రాన్ని ఆయన విద్యా విభాగం అధికారులతో కలిసి బుధవారం పరిశీలించారు. చినగదిలి మండలంలో ఎన్ని పాఠశాలలు ఉన్నాయి, ఆయా పాఠశాలల్లో ఈ విద్యా సంవత్సరంలో చదువుతున్న విద్యార్థుల సంఖ్య, వారికి అవసరమైన పాఠ్య పుస్తకాలు వచ్చాయా? లేదా? తదితర వివరాల గురించి ఎంఈవోల ద్వారా తెలుసుకున్నారు. వాటికి సంబంధించిన రికార్డులు పరిశీలించారు. ఇక్కడ కేంద్రంలో ఉన్న పాఠ్య పుస్తకాలు, నోట్ పుస్తకాలు, బ్యాగులు, బెల్టులు, షూలు కిట్లు పరిశీలించారు. ఈ సందర్భంగా ఆర్జేడీ మాట్లాడుతూ మండలంలో 72 పాఠశాలల్లో 13,148 మంది విద్యార్థులున్నారన్నారు. వారిలో ప్రస్తుతం 83 శాతం మందికి పాఠ్య పుస్తకాలు రాగా, 100 శాతం మందికి సరిపడా నోట్ పుస్తకాలు అందుబాటులో ఉన్నాయన్నారు. షూలు 80 శాతం, బెల్టులు 55 శాతం మందికి సరిపడా వచ్చినట్లు తెలిపారు. ఇంకా యూనిఫారం రాలేదని, కొద్ది రోజుల్లో రానుందని, వచ్చిన వెంటనే సరఫరా చేయనున్నామన్నారు. ఈ కార్యక్రమంలో పాఠ్య పుస్తకాల కిట్లు పంపిణీ రాష్ట్ర కోఆర్డినేటర్ కల్పన, ఎంఈవో–1 రవీంద్రబాబు, ఎంఈవో–2 అనురాధ, భవిత కోఆర్డినేటర్ గీత, పీఎంవో అప్పలనాయుడు, పీఆర్పీలు అప్పలరాజు, రాంబాబు, మండల కో–ఆర్డినేటర్ శ్రీలత పాల్గొన్నారు.


కేంద్రంలో పుస్తకాలు పరిశీలిస్తున్న ఆర్జేడీ విజయభాస్కర్